

యాదాద్రిలో ముగిసిన ఆడిట్
యాదాద్రి దేవస్థానంలో ప్రసాదాల తయారీపై ఫుడ్ సేఫ్టీ బృందం చేపట్టిన ఆడిట్ పూర్తయ్యింది. - 8లో



మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు
మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, ఎస్పీ, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి సూచించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
30.0°/19.0°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేగావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సురేష్

నడిగూడెం: తాగు నీటి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ గుర్రం సురేష్ సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలు ఎక్కడున్నాయో గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ బాణాల కవిత, వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.456.30 కోట్ల రుణాలు పంపిణీ



మాట్లాడుతున్న రత్తయ్య

నడిగూడెం : జిల్లాలో ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాలకు రూ.456.30 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు బ్యాంకు లింకేజీ డీపీఎం గొబ్బి రత్తయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022–23 సంవత్సరానికి గాను జిల్లాలోని 7,114 స్వయం సహాయక సంఘాలకు రూ. 715.82 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. వీటిలో 63 శాతం పంపిణీ చేశామన్నారు. సమావేశంలో ఏపీఎం రామలక్ష్మి, సీసీ సాంభయ్య పాల్గొన్నారు.

'మన ఊరు-మన బడి'ని వేగవంతం చేయాలి



రామన్నగూడెంలో మన ఊరు-మన బడి పనులు పరిశీలిస్తున్న డీఈఓ

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ దీటుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మన బడి పనులను వేగవంతం చేయాలని డీఈఓ అశోక్ కోరారు. బుధవారం రామన్నగూడెం, జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న మన ఊరు–మన బడి పనులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో నాగారం పీఆర్ డీఈఈ గుర్రం కొండయ్య, ఏఈఈ అశోక్, హెచ్‌ఎంలు చిప్పలపల్లి ధర్మయ్య, ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఇందులో ప్రదర్శించిన పరికరాలను డీఈఓ అశోక్ తిలకించారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీర ప్రసాద్‌యాదవ్, ఎంఈఓ బాలునాయక్, మేళా మండల నోడల్ అధికారి జెల్లా ప్రసాద్, హెచ్‌ఎంలు తబిత, యల్లయ్య, రవీందర్, వీరస్వామి, ఆర్పీలు పగిళ్ల సైదులు, వి.సైదులు, సీహెచ్.నాగరాజు, వై.శ్రీధర్‌రెడ్డి, వైవరావ్, సీహెచ్.వెంకటేశ్వర్లు, భూపతి శ్రీనివాస్‌గౌడ్, సృజన, సర్పంచ్ బైరబోయిన సునితరామలింగయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ అరిగె నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య కోరారు. బుధవారం తిరుమలగిరి మండలం తొండలోని పాఠశాలలో కొనసాగుతున్న పనులతో పాటు గ్రామంలో వైకుంఠధామం, క్రీడా ప్రాంగణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పారిశుద్ధ్యలోపం లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నెమురుగొమ్ముల శాతవాహనరావు, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, పంచాయతీరాజ్ అధికారి మారయ్య, కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖకు.. ఆదాయం ఫుల్

డిసెంబర్ 31 వరకు రూ.98.41కోట్లు

- డాక్యుమెంట్లు తగ్గినా రాబడి పెరిగింది
- గతేడాది భూముల విలువ పెంపుతో ఖజానా గలగల
- మరో మూడు నెలల్లో మరింత పెరిగే అవకాశం

భానుపురి (సూర్యాపేట) : రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం దండిగా వస్తోంది. ఈ ఏడాది డాక్యుమెంట్ల సంఖ్య తగ్గినప్పటికీ ఖజానాపై ఏ మాత్రం ప్రభావం చూపలేదు. గతేడాది తెలంగాణ ప్రభుత్వం భూముల విలువను భారీగా పెంచింది. దీంతో భూముల క్రయ విక్రయాలతో వచ్చే ఆదాయం పెరగడంతో ఈ మేరకు అధిక రాబడి ప్రభుత్వానికి సమకూరింది. గత ఆర్థిక సంవత్సరంలో పోల్చితే ఇప్పటికే ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో దాదాపు రూ.19.84 కోట్ల ఆదాయం అధికంగా వచ్చింది.

విలువ పెంపుతో తగ్గిన రిజిస్ట్రేషన్లు

జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ వ్యవసాయేతర భూములు, ప్లాట్లు, ఇళ్లు, ఇంటి



సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్	2021–22	2022–23
సూర్యాపేట	రూ.38 కోట్లు	రూ.53కోట్లు
కోదాడ	రూ.24.91కోట్లు	రూ.35.92కోట్లు
హుజూర్‌నగర్	రూ.9.66కోట్లు	రూ.9.49కోట్లు

స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో సూర్యాపేటలో 18,735 డాక్యుమెంట్లు, కోదాడలో 12,192 డాక్యుమెంట్లు, హుజూర్‌నగర్‌లో 4,853 డాక్యుమెంట్లు జరిగాయి. అయితే రిజిస్ట్రేషన్ శాఖకు సమకూరే ఆదాయాన్ని పెంచేందుకు గాను తెలంగాణ ప్రభుత్వం 2022 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూముల విలువను అమాంతంగా పెంచింది. ఈ సమయంలో గతంలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లు, నూతన క్రయ విక్రయాలు జోరుగా సాగాయి. అనంతరం ఒక్కసారిగా జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్లు తగ్గాయి.

రాబడిపై చూపని ప్రభావం

ప్రభుత్వం భూముల విలువ పెంచిన తర్వాత సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 17వేల డాక్యుమెంట్లకు రూ.53కోట్లు, కోదాడలో 10,738 డాక్యుమెంట్లకు రూ.35.92 కోట్లు, హుజూర్‌నగర్‌లో 4077 డాక్యుమెంట్లకు గాను రూ.9.49 కోట్లు ఇలా జిల్లాలో గత ఏడాది డిసెంబర్ 31వరకు మొత్తం రూ.98.41కోట్ల రాబడి వచ్చింది. హుజూర్‌నగర్ పరిధిలో డాక్యుమెంట్లతో పాటు ఆదాయం తక్కువగానే రాగా.. మరో మూడు నెలల సమయం ఉండడంతో గతంలో కంటే అధికంగానే ఆదాయం రానుంది. జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కాస్త తక్కువ కావడం, భూముల విలువ పెరగడంతో రిజిస్ట్రేషన్లు చాలా వరకు తగ్గాయి. గత రెండు నెలలుగా వీటి సంఖ్య మరింత తక్కువగా నమోదైంది. సంక్రాంతి పర్వదినం తర్వాత రియల్ వ్యాపారం పుంజుకుని రిజిస్ట్రేషన్లు జోరు కొనసాగుతాయని ఆశాభావాన్ని సంబంధిత వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. డాక్యుమెంట్లు పెరిగితే ప్రభుత్వ ఖజానాకు మరింత రాబడి రానుంది.

ముగిసిన పెద్దగట్టు జాతర వేలం పాట



వేలం పాటలో పాల్గొన్న అధికారులు

- రింగైన వ్యాపారులు
- ఆదాయానికి గండి

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్దదైన శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర వేలం పాటలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా కొబ్బరి కాయ వేలంను సూర్యాపేటకు చెందిన సుంకరబోయిన శ్రీనివాస్ రూ.8 లక్షలకు, లడ్డూ పులిహోర రూ.3.80 లక్షలకు ఖాసీంపేటకు చెందిన అల్లాస్ శ్యాం సుందర్, తలనీలాల సేకరణకు రూ.6.67 లక్షలకు హైదరాబాద్‌కు చెందిన బి. శ్రీనివాస్, కొబ్బరి చిప్పల సేకరణ రూ.1.67 లక్షలకు నల్లగొండకు చెందిన కె.నాగేష్, నాయీ బ్రహ్మణుల హక్కు రూ.70 వేలకు సూర్యాపేటకు చెందిన ఎ. సైదులు కైవసం చేసుకున్నారు.

గత జాతరతో పోల్చితే రూ.2లక్షలే..

జాతర ఆదాయానికి వ్యాపారులు బారీగా గండి కొట్టారు. గత జాతర సందర్భంగా వ్యాపారుల తీరును గమనించిన దేవాదాయ శాఖ, ఈ సారి టెండర్లలో సీల్డ్ కవర్ విధానాన్ని అమలు చేసినప్పటికీ ముందే పసిగట్టిన వ్యాపారులు రింగయ్యారు. దీంతో గత జాతరలో రూ.18.80 లక్షలు, ఈసారి రూ.20.77 లక్షల ఆదాయం వచ్చింది. అంటే గతంతో పోల్చితే కేవలం రూ.2 లక్షల ఆదాయం మాత్రమే పెరిగింది. వ్యాపారుల తీరు వల్ల జాతర ఆదాయానికి భారీగానే గండిపడినట్లు భక్తులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్, ఈఓ కుశలయ్య, కౌన్సిలర్లు షేక్ బాషా, జాటోతు లక్ష్మి, ట్రస్ట్ బోర్డు సభ్యులు , వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



చర్చించుకుంటున్న వ్యాపారులు

టీఎల్‌ఎం మేళాలతో సామర్థ్యాలు పెంపు



తుంగతుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో టీఎల్‌ఎం మేళాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

తుంగతుర్తి: విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించి, విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు టీఎల్‌ఎం మేళాలు ఎంతో దోహదపడతాయని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్‌రావు, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళాను పరిశీలించి మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 62 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం దేవునిగుట్టతండాలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే కిషోర్ ప్రారంభించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో రూ.15లక్షలతో నిర్మించే ఎస్సీ కమ్యూనిటి హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి, అన్నారం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ రాంప్రసాద్, ఎంఈఓ బోయిని లింగయ్య, ఎంపీడీఓ భీంసింగ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, ఎంపీటీసీ చెరుకు సృజనపరమేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నల్లు రామచంద్రారెడ్డి, గుండగాని రాములు, హెచ్‌ఎంలు గురువయ్య, యాకయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెయిన్స్‌కు 12,124 మంది అర్హత

- ముగిసిన పోలీస్ దేహదారుఢ్య పరీక్షలు
- లాంగ్ జంప్‌లోనే ఎక్కువ మంది అనర్హత
- చిన్నచిన్న సంఘటనలు మినహా ప్రశాంతంగా ఈవెంట్స్



పోలీస్ ఈవెంట్స్‌లో పాల్గొన్న అభ్యర్థులు

నల్లగొండ క్రైం : పోలీస్ ఉద్యోగాల ఎంపికకు నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలు బుధవారం ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో పోలీస్ ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి 2022 డిసెంబర్ 8 నుంచి 2023 జనవరి 4వ తేదీ వరకు నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈవెంట్స్ నిర్వహించారు. ఇక్కడ మొత్తం 26,433 మందికి గాను 23,524 ఈవెంట్స్‌కు హాజరయ్యారు. వారిలో 12,124 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇందులో మహిళలు 4,264 మంది ఈవెంట్స్‌కు హాజరు కాగా 2,889 మంది, పురుషులు19,260 మంది హాజరుకాగా.. 9,235 మంది ఎంపికయ్యారు. ఈవెంట్స్‌లో భాగంగా ఆలేరు మండలానికి చెందిన అభ్యర్థి స్పృహ తప్పి.. మృతిచెందారు. శాలిగౌరారానికి చెందిన ఓ మహిళా అభ్యర్థి రన్నింగ్‌లో కాలువిరిగింది. ఎక్కువ మంది అభ్యర్థులు అస్వస్థతకు గురయ్యారు. పోలీస్ ఉద్యోగాల ఎంపికలో నిర్వహించిన ఈవెంట్స్‌లో అత్యధికంగా గ్రామీణ ప్రాంత అభ్యర్థులు నెగ్గినట్లు ఈవెంట్స్‌ను పర్యవేక్షించిన పోలీస్ అధికారి ఆదిరెడ్డి తెలిపారు.

వివాదం లేకుండా..

ఈవెంట్స్‌ను పోలీస్ నియామకమండలి నియమించిన ప్రత్యేక ఎస్పీ శబరీష్, జిల్లా ఎస్పీ రెమా రాజేశ్వరి, నోడల్ అధికారి, ఏఎస్పీ వరప్రసాదరావు పర్యవేక్షించారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో ఎంపిక ప్రక్రియను చేపట్టారు. అభ్యర్థులకు ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే సీసీ కెమెరాల్లో రికార్డు చేసిన దృశ్యాలను చూపించారు. అభ్యర్థుల చాతి వద్ద రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ కార్డు, చేతికి రిస్ట్ బ్యాండ్ ఏర్పాటు చేశారు. సెన్సార్ల ఆధారంగా అభ్యర్థుల కదలికలను గుర్తించారు.

చివరి రోజు 1073 మంది హాజరు

ఈవెంట్స్‌లో చివరి రోజు బుధవారం 1200 మంది అభ్యర్థులకుగాను 1,073 హాజరయ్యారు. వారిలో 517 మంది అర్హత సాధించారు. ఈవెంట్స్‌కు వివిధ కారణాలతో హాజరుకాని వారికి మరోసారి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే విషయమై అధికారుల వద్ద ఎలాంటి సమాచారం లేదు.

ఆర్టీసీ పరిరక్షణకు ఐక్య పోరాటాలు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఆర్టీసీ పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య తెలిపారు. తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన జీపు యాత్ర బుధవారం సూర్యాపేటకు చేరింది. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ సమీపంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు రంగంలో దాదాపుగా పది నుంచి 40 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు మోదీ ప్రభుత్వం తెచ్చిన మోటారు వాహన చట్టం 2019 గొడ్డలి పెట్టుగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. శ్రీకాంత్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాంబాబు ,నెమ్మాది వెంకటేశ్వర్లు, నాయకులు చెరుకు ఏకలక్ష్మి, నాగార్జున రెడ్డి, ములకలపల్లి రాములు, మట్టపల్లి సైదులు కోట గోపి, వేల్పుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



యువజనోత్సవాల్లో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



నృత్యం చేస్తున్న యువతులు

- కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

సూర్యాపేటటౌన్ : స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువత విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియ్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జానపద కళల్లో జాతీయ స్థాయిలో మంచి పేరుతేవాలని ఆయన కోరారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద పాటలు, ఉపన్యాసం అంశాల్లో పోటీలు నిర్వహించారు. వీటిలో 160 మంది కళాకారులు పాల్గొన్నారు. జానపద నృత్యంలో టీటీడబ్ల్యూఆర్‌డీసీ(డబ్ల్యూ) సూర్యాపేట ప్రథమ స్థానం, జానపద పాటల్లో కోదాడ కేఆర్‌ఆర్‌జీజేసీ ప్రథమ స్థానం, ఉపన్యాసంలో కొమ్ము ప్రశాంత్ ప్రథమ స్థానం సాధించినట్లు జిల్లా క్రీడల, యువజన అధికారి బి.వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్ర స్థాయిలో ఈ నెల 9, 10 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, డీఐఈఓ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రోడ్డు భద్రత అందరి బాధ్యతని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టర్‌లోని కలెక్టర్ చాంబర్‌లో రోడ్డు భద్రతా ప్రమాణాలు, ప్రమాదాల నివారణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ తప్పిదాలు ఎక్కువ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, రోడ్లపై ఏర్పాటు చేసిన సూచికలను గమనించి వాహనాలను నడపాలని కలెక్టర్ సూచించారు. అధికారులు రోడ్డు భద్రత మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత మీటింగ్‌లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలపై నేషనల్ హైవే కాంట్రాక్టర్ జీఎంఆర్ మేనేజర్ రమేష్‌ను కలెక్టర్ అడిగారు. దీంతో మేనేజర్ తెలిపిన సమాచారంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నేషనల్ హైవే 65లో టేకుమట్ల, పిల్లలమర్రి, జనగాం క్రాస్ కూడళ్ల వద్ద లైట్లు ఏర్పాటు, హైవేపై ట్రంబుల్స్ స్ట్రిక్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా రోడ్డు భద్రతపై సమీక్షించారు. సమావేశంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్, డీఎస్పీ నాగభూషణం డీఎంహెచ్ఓ కోటాచలం, ఎన్‌హెచ్ఏ సైట్ ఇంజనీర్ తేజ రెడ్డి , నేషనల్ హైవే సూర్యాపేట డీఈ ప్రవీణ్ రెడ్డి, ఆర్‌అండ్ బీ అధికారి యాకూబ్, జీఎంఆర్ సంస్థ నుంచి నాగకృష్ణ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ

పెంచాలని కోరితే.. తగ్గించారు!

- 30 నుంచి 20 పడకలకు తగ్గిన కోదాడ ప్రభుత్వ వైద్యశాల స్థాయి
- 10పడకల పురుషుల వార్డు ఎత్తివేత
- డయాలసిస్ సెంటర్‌కు కేటాయింపు
- ఇక మగవారికి ఇన్‌పేషెంట్లుగా నో చాన్స్

కోదాడ: ప్రభుత్వ వైద్యశాల స్థాయిని 30 పడకల నుంచి 100 పడకలకు పెంచాలని కొన్నేళ్లనుంచి ప్రజలు కోరుతుంటే దానిని పట్టించుకోకుండా అధికారులు 20 పడకలకు తగ్గించారు. డయాలసిస్ సెంటర్ పేరుతో పురుషుల వార్డునే ఎత్తేశారు. అధికారుల తీరుపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఇక నుంచి కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో పురుషులను ఇన్‌షేషంట్లుగా చేర్చుకోరు. వైద్యం కోసం వచ్చిన పురుషులను ఇక్కడి నుంచి ఇతర వైద్యశాలలకు పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వైద్యశాలలో డాక్టర్లు కూర్చోవడానికి గదులు లేవు. ఒకే గదిలో ముగ్గురు వైద్యులు కూర్చొని వైద్యం చేయాల్సి వస్తోంది.

పురుషులు ఓపీ చూయించుకొని వెళ్లాల్సిందే..

ఇటీవల కోదాడ ప్రభుత్వ వైద్యశాలను 30 నుంచి 50 పడకలకు పెంచుతామని నాయకులు, అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు డయాలసిసి సెంటర్ మంజూరైంది. దాని పనులు వేగంగా జరుగుతున్నాయి. దీనికి పట్టణ ప్రజలు సంతోషించే లోపే మరో పిడుగులాంటి వార్త అధికారులు చెబుతున్నారు. డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలంటే ప్రస్తుతం ఉన్న వైద్యశాలలో వసతి లేదు. దీంతో ప్రస్తుతం వైద్యశాలలో ఉన్న 10 పడకల పురుషుల వార్డును డయాలసిస్ సెంటర్‌కు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో వైద్యం కోసం వచ్చే మగ పేషెంట్లు వైద్యశాలలో ఇన్‌పేషెంట్లుగా ఉండి వైద్యం చేయించుకోవడానికి అవకాశం లేదు. కేవలం ఓపీ చూయించుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం వైద్యశాలలో వైద్యులు కూర్చొని రోగులను చూడడానికి కూడా కన్సల్టెన్సీ రూంలు లేవు. ముగ్గురు వైద్యులు ఒకే గదిలో కూర్చొని వైద్యం చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న వైద్యశాల పైన అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదు. ఇకనైనా వైద్యశాలలో నెలకొన్న సమస్యలపై అధికారులు, పాలకులు దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



కోదాడ ప్రభుత్వ వైద్యశాల

"డయాలసిస్ సెంటర్‌కు కేటాయించాం

కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో స్త్రీలకు 20 పడకలతో ఒక వార్డు, పురుషులకు 10 పడకలతో ఒక వార్డు ఉంది. డయాలసిస్ సెంటర్‌కు వసతి లేక పురుషుల వార్డును కేటాయించాం. దీంతో ఇక నుంచి ఇది 20 పడకల ఆస్పత్రి అవుతుంది. ఆస్పత్రిలో వసతులు లేక ముగ్గురు వైద్యులు ఒక చోట కూర్చొని రోగులను చూడాల్సి వస్తోంది.

– డాక్టర్ రజిని, వైద్యశాల సూపరిండెంట్

100 పడకలు.. హామీలకే పరిమితం

లక్ష మంది జనాభా ఉన్న కోదాడ పట్టణంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ వైద్యశాల కనీస సేవలందించడం లేదు. 1968లో ప్రాథమిక వైద్యశాలగా ప్రారంభంకాగా వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 2008లో 30 పడకల స్థాయికి పెంచారు. ఆ తరువాత ఈ వైద్యశాల స్థాయిని 100 పడకలకు పెంచాలని అనేక మంది కోరుతున్నా అది నేరవేరలేదు. ప్రతి ఎన్నికల సందర్భంలో నాయకులు తాము గెలిస్తే వైద్యశాలను 100 పడకలుగా మారుస్తామని చెప్పడం, ఆ తరువాత దాన్ని గాలికి వదిలేయడం పరిపాటిగా మారింది. దీంతో కోదాడ వైద్యశాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాలకవీడు : పశువులకు వచ్చే వ్యాధుల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. పాలకవీడు మండలంలోని అలింగాపురం గ్రామంలో నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 58 గేదెలకు గర్భకోశ, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్త లక్ష్మమ్మ, డాక్టర్లు శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, నాగేందర్, సురేష్ గోపాలమిత్రలు, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు



రోడ్డు పక్కకు వెళ్లి ఆగిన కారు

తుర్కపల్లి: ముందు వెళ్తున్న బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని రుస్తాపూర్ గ్రామశివారులో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. తుర్కపల్లి మండలంలోని చొక్లతండాకు చెందిన నరేందర్‌నాయక్ తుర్కపల్లి నుంచి భువనగిరి వైపునకు బైక్‌పై వెళ్తున్నాడు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా నరేందర్‌నాయక్ బైక్‌ను పక్కకు తిప్పడంతో వెనుకనే వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన నరేందర్‌నాయక్‌కు గాయాలు కాగా, కారు రోడ్డు పక్కకు వెళ్లి ఆగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని వివరాలు సేకరించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

వలిగొండ: విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందిన సంఘటన మండలంలోని గోకారం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. గోకారం గ్రామానికి చెందిన నత్తి గోపాల్ తన వ్యవసాయం బావి వద్ద రోజుమాదిరిగా గేదెలను మేపుతుండగా రైతు వేదిక సమీపంలో విద్యుత్ వైరు తగిలి షాక్‌తో పాడి గేదె అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

బ్యాంకు మేనేజర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తున్న రైతు

గుర్రంపోడు: రైతుబంధు డబ్బులను పంట రుణం తీసుకున్న ఖాతాలోకి మార్చడంపై నిరసన వ్యక్తం చేస్తూ ఓ రైతు బ్యాంకు మేనేజర్‌పై బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు.. మండలంలోని కొప్పోలు ఎస్‌బీఐ శాఖలో కొప్పోలు గ్రామానికి చెందిన ఐతరాజు అంజయ్య స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో రూ.2లక్షలు పంట రుణం తీసుకున్నాడు. అయితే అంజయ్య కుమారుడు ప్రసాద్ ఖాతాలో జమ అయిన రైతు బంధు డబ్బులు రూ.20వేలను తండ్రి రుణం తీసుకున్న ఖాతాలోకి బ్యాంకు అధికారులు మార్చారు. ఈ విషయం తెలుసుకున్న ప్రసాద్ తన ఖాతాలోని రైతు బంధు డబ్బులను తనకు తెలియకుండా తన తండ్రి రుణం తీసుకున్న ఖాతాకు ఎలా మార్చుతారని బ్యాంకు మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. బ్యాంకు మేనేజర్ నుంచి సరైన స్పందన లేకపోవడంతో గుర్రంపోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వైభవంగా అధ్యయనోత్సవాలు

- మూడోరోజు ఉదయం శ్రీరాముడిగా.. రాత్రి శ్రీవేంకటేశ్వరుడిగా దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహస్వామి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఈ ఉత్సవాలు మూడో రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10గంటలకు ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో స్వామి వారిని శ్రీరాముడిగా అలంకరించి హారతినిచ్చారు. అనంతరం తిరువీధులు, మాఢ వీధిలో సేవను ఊరేగించారు. ఈ సేవకు ముందు ఆచార్యులు, పారాయణీకులు దివ్య ప్రబంధ పారాయణాన్ని పఠించారు. ఈ వేడుకలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ ఈఓ గీతారెడ్డి, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, ముఖ్య అర్చకులు, రుత్వికులు, పారాయణీకులు పాల్గొన్నారు.



శ్రీరాముడి అలంకరణ సేవకు ముందు ప్రబంధ పారాయణం పఠిస్తున్న ఆచార్యులు



శ్రీవేంకటేశ్వరుడి అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీనర్సింహ స్వామి

రాత్రి శ్రీవేంకటేశ్వర అలంకారంలో..

రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆచార్యులు నిత్యారాధనలు నిర్వహించారు. అనంతరం పారాయణీకులచే దివ్య ప్రబంధ కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి అలంకార సేవకు ఆచార్యులు హారతినిచ్చి, తిరువీధుల్లో సేవను ఊరేగించారు.

నెలాఖరులోగా గొర్రెల యూనిట్లు పంపిణీ

- రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ బాలరాజుయాదవ్

నల్లగొండ టౌన్: నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో డీడీలు కట్టిన లబ్ధిదారులకు ఈ నెలాఖరులోగా గొర్రెల యూనిట్లు పంపిణీ చేయడం పూర్తిచేస్తామని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ తెలిపారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు జిల్లాల్లో కలిపి 7661 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 93కోట్ల76లక్షల63వేలు జమచేసిందన్నారు. లబ్ధిదారులే నేరుగా వారు ఇష్టం ఉన్న చోట గొర్రెలను కొనుగోలు చేసుకునేందుకు గాను ప్రభుత్వం ఖాతాలల్లో డబ్బులు జమచేసిందన్నారు. గొర్రెల యూనిట్ల కొనుగోలు కోసం మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటుచేసి పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. గొర్రెల యూనిట్లకు బీమా సౌకర్యం, రవాణా, ఫీజు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ డాక్టర్ అంబటి యాదగిరి, ఏడీ డాక్టర్ విశ్వేశ్వర్‌రావు, బకరం వెంకన్న, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న దూదిమెట్ల బాలరాజుయాదవ్

ప్లాట్లను క్రమబద్ధీకరించాలని వినతి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

భువనగిరిటౌన్: ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలోని సర్వే నంబర్లు 42, 272లో గతంలో పేదలకు ఇచ్చిన స్థలాలను క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు బుధవారం యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 11.15 గుంటల భూమిని మామిడి రాంరెడ్డి వద్ద 1994 సంవత్సరంలో ప్రభుత్వం కొనుగోలు చేసి 196మంది నిరుపేదలైన ఎస్సీ, బీసీ, ఓసీ వికలాంగులకు, కుటుంబ నియంత్రణ చేసుకున్న వారికి స్థలాలు ఇచ్చారని, వాటిని క్రమబద్ధీకరణ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు బాలరాజు, సంగీరాజు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నూలు ధరలను నియంత్రించాలి

భూదాన్‌పోచంపల్లి: ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న నూలు ధరలను నియంత్రించాలని పోచంపల్లి హ్యాండ్లూమ్ సిల్క్, కాటన్ యార్న్ అసోషియేషన్ అధ్యక్షుడు గుండు పరమేశ్ అన్నారు. బుధవారం వలిగొండ మండలం వేములకొండ దేవస్థాన ఆవరణలో అసోషియేషన్ 42వ వార్షికోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరోనా తరువాత నూలు ధరలు రెట్టింపు కావడం వల్ల పరోక్షంగా చేనేత పరిశ్రమ, ఇటు కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. ప్రభుత్వం నూలు ధరలను తగ్గించాలని కోరారు. అలాగే చేనేత వస్త్రాలపై కేంద్రం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అసోషియేషన్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో పద్మశాలీ మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ చిట్టిపోలు శ్రీనివాస్, ఆలిండియా హ్యాండ్లూమ్ హౌజ్ డైరెక్టర్ భారత వాసుదేవ్, టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, బడుగు చండీకేశ్వర్, కౌన్సిలర్ భోగ భానుమతివిష్ణు, చేనేతకార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, భారత లవకుమార్, భోగ స్వామి, అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హ్యాండ్లూమ్ సిల్క్, కాటన్ యార్న్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్

కలెక్టరేట్‌లో బ్రెయిలీ జయంతి వేడుకలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ కనుగొన్న లిపి ప్రపంచమంతా ఉన్న అంధుల జీవితాల్లో వెలుగును నింపిందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రంగాల్లో అంధులు ముందంజలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ జిల్లా అధికారి జ్యోతిపద్మ, జిల్లా వైద్యాధికారి కోటాచలం, జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డీఎస్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్రెయిలీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ కేశవ్, జిల్లా అధికారులు

వైశ్య ఫెడరేషన్ సేవలు అభినందనీయం

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ముందుండడం అభినందనీయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చల్ల లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని మంత్రి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో చల్ల లక్ష్మీప్రసాద్, శ్రీశైలం, నరేష్, ఎర్రయ్య, లక్ష్మణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సిద్ధాంతాల కోసం పోరాడిన వ్యక్తి మల్లయ్య

- ప్రొఫెసర్ హరగోపాల్

భువనగిరి : నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి జైని మల్లయ్య గుప్తా అని సామాజిక వేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్, వీక్షణం సంపాదకుడు ఎస్.వేణుగోపాల్ అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జైని మల్లయ్య గుప్తా సంతాప సభ బుధవారం భువనగిరి పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ.. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటాలను ప్రారంభించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా పాల్గొన్నారని అన్నారు. జైని మల్లయ్య గుప్తా పేరుతో రచయితలకు గానీ, సామాజిక కార్యకర్తలకు గానీ అవార్డులను ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జైని మల్లయ్యగుప్తా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



జైని మల్లయ్య గుప్తాకు నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

ప్రసాదాల తయారీపై ముగిసిన ఆడిట్

యాదగిరిగుట్ట: యాదాద్రి దేవస్థానంలో నైవేద్యం ప్రసాదాల తయారీపై ప్రత్యేక ఫుడ్ సేఫ్టీ బృందం నిర్వహించిన తుది ఆడిట్ విజయవంతంగా పూర్తయిందని ప్రోగ్రాం రాష్ట నోడల్ అధికారి జ్యోతిర్మయి అన్నారు. బుధవారం ఇండోర్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఫుడ్ సేఫ్టీ ఆడిటర్ వికాస్ మిశ్రా, ట్రైనర్ చాగంటి అంజనేయులు, ఫుడ్ సేఫ్టీ డిసిగ్నేటెడ్ అధికారి సుమన్ కల్యాణ్, అధికారి పి. స్వాతి యాదాద్రిని సందర్శించి దేవాలయంలో అన్నదానం, రామానుజాకూటం, ప్రసాద తయారీ, వివిధ వంటశాలలు, ఆహార పదార్థాల తయారీలో ఆచరిస్తున్న పద్ధతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ ఈఓ గీతారెడ్డి, డిప్యూటి ఈఓ భాస్కర్, ఆలయ కమిటీతో అధికారులు సమావేశమై కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ సాధించుకునేలా ప్రసాదం తయారీ, అన్నదానం చేసే విధానంపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నోడల్ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ శ్వేతా మహంతి, ఐపీఎం శివలీల పర్యవేక్షణలో రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలను ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్లను అందజేస్తారని తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం యాదాద్రిలో ఫైనల్ ఆడిట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రసాదాల తయారీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ పొందిన మొట్టమొదటి ఆలయంగా యాదాద్రి నిలవనుందని ఆమె పేర్కొన్నారు.



యాదాద్రి ఆలయంలో ప్రసాదం తయారు చేసే మిషన్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు రాష్ట్ర మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ రానున్న నేపథ్యంలో పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం వారు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న హెలీపాడ్, ఈఎస్ఐ డిస్పెన్సరీని సందర్శించి రూట్‌మ్యాప్‌ను, సభాస్థలి, ఆదర్శ కాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఎమ్మెల్యే నూతన క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం నూతన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, సీఐ రామలింగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌సీ సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ దామోదర్‌రావు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చండూరులో..

చండూరు: చండూరు మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు శుక్రవారం మంత్రులు కేటీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నట్లు మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే చండూరులోని సభా స్థలిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.2కోట్లతో మున్సిపల్ భవనం, రూ.2కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్, రూ.5.50కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రూ.2కోట్లతో సమీకృత మార్కెట్, రూ.22 కోట్లతో డబుల్ రోడ్ల నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డీఓ జయచందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, కమిషనర్ మణికరణ్, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ నవీన్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే సైదిరెడ్డి



చండూరులో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

రెండు చేనేత క్లస్టర్లు ప్రారంభం...

గట్టుప్పల మండల కేంద్రంలో, తేరట్‌పల్లి గ్రామంలో రెండు చేనేత క్లస్టర్లను మంత్రులు ప్రారంభించనున్న నేపథ్యంలో మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులతో బుధవారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీపీ పల్లె కళ్యాణి, సర్పంచ్ ఇడెం రోజా, ఎంపీటీసీ గొరిగే సత్తయ్య, ఇడెం కైలాసం, కంచుకంట్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆస్పత్రి వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ పద్మజాదివాకర్‌రెడ్డి

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని డాక్టర్ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం(నవ్య నర్సింగ్ హోమ్) 27వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజాదివాకర్‌రెడ్డి ఆస్పత్రిలో కేక్ కట్ చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భార్గవి, నారాయణ, ర్యాకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మన యాదాద్రి- మన బాధ్యత'

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట : ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతున్న యాదగిరిగుట్ట మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ - 2023 పోటీల్లో అవార్డు లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం ముందుకెళ్తోందది. అందులో భాగంగా 'మన యాదాద్రి - మన బాధ్యత' పేరుతో బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ హాజరై మాట్లాడారు. మనం బాగుండాలంటే ఇల్లు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నా. అందుకోసం ప్రజలంతా తడి, పొడి చెత్తను ఇంటి దగ్గరే వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో తడి చెత్తనుంచి సేంద్రియ ఎరువు తయారీ, పొడి చెత్తను రీసైక్లింగ్ చేస్తారని తెలిపారు. తద్వారా మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. అంతేకాకుండా సేంద్రియ ఎరువును ఇళ్లలో మొక్కలు పెంచుకునే వారికి ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. గిన్నీస్ బుక్‌లో రికార్డు లిఖించే విధంగా యాదగిరిగుట్టను సర్వాంగ సుందరంగా తీర్చుకోవాలన్నదే 'మన యాదాద్రి- మన బాధ్యత' కార్యక్రమ ఉద్దేశమన్నారు. అనంతరం మన యాదాద్రి - మన బాధ్యత పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు మురళీ, కన్నదరావు, విపుల్, జీఎస్‌ఆర్ అన్నమయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ కాటం రాజు, మెప్మా యాదగిరిగుట్ట ఇన్‌చార్జ్ శ్యామల, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్‌బాబు, మేనేజర్ కే.నరేష్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వారికి రానట్టేనా?

కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులకు అందని రైతుబంధు

- సీసీఎల్‌ఏ నుంచి రాని సమాచారం
- నిలిచిపోయిన బ్యాంకు ఖాతాల వివరాల నమోదు
- సమాచారం వస్తదా, రాదా తెలియని పరిస్థితి
- నూతన పాస్‌బుక్‌లు పొందిన రైతులు ఎనిమిది వేల మందికి పైనే
- దరఖాస్తు చేసుకున్న వారు 5,495



సాక్షి, యాదాద్రి : కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు ఈసారి రైతుబంధు సాయం అందే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ వ్యవసాయ శాఖ ముఖ్య కమిషనర్ (సీసీఎల్‌ఏ) నుంచి వచ్చిన డేటాలో వారి వివరాలు లేవు. యాసంగిలో పెట్టుబడి సాయం వస్తుందని ఆశపడ్డ కొత్త రైతులు ఇప్పుడు నిరాశలో ఉన్నారు. కొత్తగా పాస్ పుస్తకాలు తీసుకున్న రైతులు జిల్లా వ్యాప్తంగా 8 వేలకు పైనే ఉన్నారు.

5,495 మంది దరఖాస్తు

రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అమల్లోకి తీసుకువచ్చిన తర్వాత వివిధ రకాల సాంకేతిక సమస్యల వల్ల వేలాది మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు రాలేదు. ఇటీవల సమస్యలను పరిష్కరించడంతో జిల్లాలోని 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీల పరిధిలో 8 వేల మందికి పైగా రైతులు కొత్త పాస్ పుస్తకాలు పొందారు. వీరిలో 5,495 మంది రైతుబంధు సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. సరైన ప్రచారం లేకపోవడం, అవగాహన లేమితో ఇంకా 2,500 మందికి పైగా దరఖాస్తు చేయలేదు. 2022 డిసెంబర్ 20లోపు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన వారు ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రకటించారు.దరఖాస్తు చేసుకున్న రైతులు రైతుబంధు సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఈనెల 4వ తేదీ వరకు వచ్చిన ధరఖాస్తులు

మండలం	దరఖాస్తులు		
భువనగిరి	659	అడ్డగూడూరు	191
యాదగిరిగుట్ట	150	చౌటుప్పల్	750
ఆత్మకూర్(ఎం)	155	బొమ్మలరామారం	553
మోటకొండూరు	300	ఆలేరు	458
గుండాల	369	పోచంపల్లి	550
వలిగొండ	547	బీబీనగర్	234
మోత్కూరు	207	తుర్కపలి	372

నిరాశలో రైతులు

వానాకాలం సీజన్‌లో రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే వారి ఖాతాల్లో నగదు జమ అయ్యింది. యాసంగిలోనూ అదే విధంగా వస్తుందని కొత్త పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఆశపడ్డారు. కానీ, సీసీఎల్‌ఏ నుంచి సమాచారం రాకపోవడంతో అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. బ్యాంకు పాస్ పుస్తకం నంబర్‌ను ఎంట్రీ చేయడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు చెబుతున్నారు.

వివరాలు పంపని సీసీఎల్‌ఏ

నూతనంగా పట్టదారు పాస్ పుస్తకాలు తీసుకున్న రైతుల వివరాలను సీసీఎల్‌ఏ వ్యవసాయ శాఖకు పంపించలేదు. దీంతో వ్యవసాయ శాఖ కమిషనర్ వెబ్‌సైట్‌లో కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు లేవు. గతంలో మాదిరిగానే రకరకాల సాంకేతిక సమస్యలు చూపుతోంది. నూతన పాస్ బుక్ నంబర్, బ్యాంకు ఖాతా నంబర్, విస్తీర్ణం వివరాలను సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ వివరాల ఆధారంగా ఏఈఓలు రైతుల బ్యాంకు పాస్‌పుస్తకం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత రైతుబంధు సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.కానీ, వెబ్‌సైట్‌లో వారి వివరాలు చూపడం లేదు.

డేటా వస్తే జమ చేస్తాం



కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన వారి డేటా సీసీఎల్‌ఏ నుంచి మాకు రాలేదు. డేటాలో పట్టాదారు పాస్ బుక్ నంబర్, రైతు పేరు ఉంటుంది. ఈ వివరాలు సీసీఎల్‌ఏ నుంచి మాకు వస్తేనే నిర్ణీత ఫార్మాట్‌లో రైతుల బ్యాంకు అకౌంట్ నంబర్ అప్‌లోడ్ చేసి వారి ఖాతాల్లో డబ్బులు జమచేస్తాం. గత సీజన్‌లలో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన వారికి వెంటనే రైతుబంధు సహాయం అందింది. మాకు డేటా రాగానే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తాం.

–అనురాధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి